క్లుప్తంగా

అన్నప్రసాద వితరణకు రూ.లక్ష విరాళం



విరాళాన్ని అందించిన దాతను సత్కరిస్తున్న పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న అన్నప్రసాద వితరణకు సోమవారం విజయవాడ జిల్లా గుడివాడకు చెందిన జి.వెంకట సత్యనాథ చక్రవర్తి రూ.1,01,116 విరాళాన్ని పర్యవేక్షకురాలు టీ.హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం తరపున స్వామివారి శేషవస్త్రాలను, లడ్డూప్రసాదాలను, జ్ఞాపికను అందించి సత్కరించారు.

మహానందీశ్వరుడి దంపతులకు పల్లకీసేవ



మహానందిలో పల్లకీసేవ దృశ్యం

మహానంది: మహానందిలో కొలువైన గంగ, కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వారి దంపతులకు సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ నల్లకాలువ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, నాగేశ్వరశర్మ, అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాకారాల్లో పల్లకీ ఉత్సవం నిర్వహించగా పలు ప్రాంతాల భక్తులు పల్లకీని మోస్తూ ఓం నమో మహానందీశ్వరాయ, శ్రీ కామేశ్వరీదేవికి జై..అంటూ ప్రణమిల్లారు. సూపరింటెండెంట్ అంబటి శశిధర్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

అలరించిన భక్తిరంజని



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కర్యాక్రమంలో భాగంగా సోమవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన ఆర్.మధుమతి చేత భక్తి రంజని కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గం గం గణపతి వదనం, శివపద భజనా, సర్వమంగళాధవ శివ, అంబా శాంభవి అఖిలాండేశ్వరి, కైలాసగిరిలో ప్రమథ గణములతో, శంబో శివశంభో, హరహర శంకరా జయ జయ శంకరా తదితర గీతాలకు ఆర్.మధుమతి, జి.విశాలాక్షి గాయనీమణులు ఆలపించారు. మృదంగ సహకారాన్ని ప్రసాద్, వయోలిన్ సహకారాన్ని శంకర్ అందించారు.

వివాదాస్పదమైన చర్చి నిర్మాణం



పనులు నిలిపివేయాలని సూచిస్తున్న ఆర్ఐ శ్రీరంగారెడ్డి

పగిద్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో కాటం పెద్ద స్వాములు చేపట్టిన చర్చి నిర్మాణ పనులు వివాదాస్పదమయ్యాయి. ఇదే గ్రామానికి చెందిన శ్రీనివాసులుతో పాటు మరికొంత మంది జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ నిర్మాణ ప్రదేశానికి వెళ్లి పనులు నిలిపివేయాలని సూచించారు. చర్చి నిర్మాణ స్థలం ముచ్చుమర్రి పొలిమేరలోని కేసీ కాలువ పరిధిలోకి వస్తున్నందున నీటిపారుదల శాఖ అధికారుల అనుమతి తీసుకోవాలని ఆర్ఐ శ్రీరంగారెడ్డి సూచిస్తూ తాత్కాలికంగా పనులు నిలిపివేయించారు.

ఎస్సీ కాలనీవాసులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిర్మాణ పనులను పర్యవేక్షించామని ఆయన వెల్లడించారు.

ప్రతి అర్జీని పరిష్కరిస్తాం

కొత్తపల్లి: రైతులు, ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని పరిష్కరిస్తామని తహసీల్దార్ ఉమారాణి సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలలో రైతులకు, ప్రజా సమస్యలు ఏమున్నా అర్జీల రూపంలో అధికారులకు తెలియజేస్తే తప్పకుండా వాటిని పరిష్కరిస్తామన్నారు. భూ సర్వే కోసం నలుగురు, భూ సమస్య పరిష్కారం కోసం ఒకరు అర్జీలు ఇచ్చాన్నారు. వీటిని సంబంధిత అధికారులకు పంపి పరిష్కరించాలని ఆదేశించారు.

రోడ్డెక్కిన ఉపాధి కూలీలు

• పనులు కల్పించాలని డిమాండ్ • ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా

జూపాడుబంగ్లా మండలం తాటిపాడు గ్రామానికి చెందిన ఉపాధి కూలీలు రోడ్డెక్కారు. తమకు పనులు కల్పించాలని అధికారులను డిమాండ్ చేశారు. పనులు లేక పస్తులుండాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం తాటిపాడు గ్రామానికి చెందిన పలువురు ఉపాధి కూలీలు పనులు కల్పించాలని కోరుతూ జూపాడుబంగ్లా ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నాకు దిగారు. ఈసందర్భంగా పలువురు కూలీలు మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం పనులు కల్పించి కూలీలు వలస వెళ్లకుండా చూడాలని జిల్లా కలెక్టర్ రాజకుమారి పేర్కొంటున్నా తమ గ్రామంలో ఎందుకు పనులు కల్పించటం లేదని ప్రశ్నించారు. గ్రామంలో వ్యవసాయ పనులు ముగియటంతో పనుల్లేక ఆటోల్లో ఇతర గ్రామాలకు వలస వెళ్లి పనులు చేసుకొంటున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి తమ గ్రామంలోనే ప్రారంభించకపోవటం వెనుక అంతర్యమేమిటన్నారు. రాజకీయ నాయకుల మధ్య ఎన్ని విభేదాలున్నా గ్రామంలో పనులు కల్పించకుండా ఉపాధికూలీల కడుపుకొట్టడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు.

– జూపాడుబంగ్లా



ఉపాధిపనులు కల్పించాలని కోరుతూ ఎంపీడీఓ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తాటిపాడు ఉపాధికూలీలు

రాజకీయాలెందుకు



గ్రామంలోని నాయకులు, అధికారులు రాజకీయాలను పక్కనపెట్టి గ్రామంలోని వ్యవసాయ కూలీలకు పనులు కల్పించాలి. అధికారులు, రాజకీయనాయకులు వారి రాజకీయాల కోసం గ్రామంలో ఉపాధిపనులు లేకుండా చేయటం పద్ధతి కాదు. గ్రామంలో వెంటనే ఉపాధి పనులు కల్పించాలి. –ఈదమ్మ, తాటిపాడు

ఉపాధిపనులు కల్పించాలి



అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించి మా గ్రామంలోనే ఎందుకు కల్పించటం లేదో అధికారులు చెప్పాలి. గ్రామంలో వ్యవసాయ కూలీలు పనులు ముగిశాయి. పనుల్లేక ఇంట్లో ఖాళీగా ఉంటున్నాం. గ్రామంలో ఉపాధిపనులు కల్పించి ఆదుకోవాలి. – లచ్చమ్మ, తాటిపాడు

పనుల్లేక పస్తులుంటున్నా



గ్రామంలో వ్యవసాయ కూలీపనులు అయిపోయాయి. ఉపాధి పనులైనా పెడ్తారంటే అదీలేదు. పనులుంటేనే సరుకులు కొనుగోలు చేసుకొనే వీలుంటుంది. పనుల్లేకపోవటంతో పస్తులుంటున్నాను. వెంటనే గ్రామంలో ఉపాధి పనులు కల్పించి మాబోటి వారిని ఆదుకోవాలి. – యశోదమ్మ, తాటిపాడు

ఉపాధి పనులు ప్రారంభించాలి

నందికొట్కూరు: ఉపాధి పనులను ప్రారంభించాలని జూపాడుబంగ్లా మండల జెడ్పీటీసీ సభ్యులు పోచా జగదీశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎంపీడీఓ గోపికృష్ణ, గౌరీబాయికి తాటిపాడు గ్రామంలో ఉపాధి పనులు కల్పించాలని వినతిపత్రం అందజేశారు. రాజకీయ కుట్రలతో ఉపాధి పనులు నిలిపివేయడంతో కొన్ని కుటుంబాలు వలస వెళ్తున్నాయని, ఇప్పటికైనా అధికారులు స్పందించి స్థానికంగానే పనులు కల్పించాలని ఆయన అధికారులను కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి కేశవరెడ్డి నాగార్జునరెడ్డి, ప్రధాన కార్యదర్శి కోసిక తిరుమలేశ్వరరెడ్డి, మండల కన్వీనర్ తోకల కృష్ణారెడ్డి, తాటిపాడు నాయకులు తరుణ్‌కుమార్‌రెడ్డి, అల్లావుద్దీన్, లక్ష్మన్న, ఎర్రన్న పాల్గొన్నారు.

పనులు కల్పించకపోవటం తగదు



మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిపనులు కల్పించి మా ఒక్క గ్రామంలోనే పనులు కల్పించకపోవటం పద్ధతికాదు. కలెక్టర్ అడిగిన వారందరికీ పనులు కల్పిస్తామన్నప్పుడు మా గ్రామంలో పనులు కల్పించాలని ఎన్నిమార్లు కోరినా పనులు కల్పించకపోవటం ఏమాత్రం బాగోలేదు. వెంటనే మాఊళ్లో పనులు కల్పించి ఆదుకోవాలి. – కృష్ణుడు, తాటిపాడు

నేడు జాబ్‌మేళా

ఆత్మకూరు: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ జి.శ్రీనివాస్ తెలిపారు. ఐదు కంపెనీల ప్రతినిధులు హాజరై ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. ఉమ్మడి జిల్లాలోని టెన్త్, పాలిటెక్నిక్, డిగ్రీ ఆపై పూర్తి చేసిన 18 నుంచి 30 ఏళ్లలోపు వయస్సు ఉన్న అభ్యర్థులు ఇంటర్వ్యూలకు సర్టిఫికెట్లతో హాజరుకావాలన్నారు. 260 ఖాళీలు ఉన్నాయని, ఎంపికైన వారికి రూ.10 వేల నుంచి రూ.18 వేల మధ్య వేతనం ఉంటుందని తెలిపారు.

గుడిసె దగ్ధం

మహానంది: మండలంలోని చలమ గ్రామంలో వెంకటరాముడు, సరళ దంపతులు గుడిసె సోమవారం దగ్ధమైంది. గుడిసెలో మంటలు చెలరేగడంతో ఆర్పేందుకు యత్నించగా ఎండ వేడిమి అధికంగా ఉండటంతో అదుపులోకి రాలేదు. దీంతో సుమారు రూ. 2 లక్షలు విలువైన వస్తువులు అగ్నికి ఆహుతయ్యాయని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు.

విత్తనాల ఎంపిక కీలకం

మహానంది: పంటల సాగులో విత్తనాల ఎంపిక ఎంతో కీలకమని ఆంధ్రప్రదేశ్ స్టేట్ సీడ్ సర్టిఫికేషన్ అథారిటీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ వై.సతీష్ తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా మహానంది మండలం తమ్మడపల్లె, నందిపల్లె గ్రామాల్లో సోమవారం పర్యటించి రైతులతో మాట్లాడారు. ఆర్ఎన్ఆర్–15048, బీపీటీ 5204, ఎన్‌డీఎల్ఆర్–7 విత్తన ఉత్పత్తికి సంబంధించిన వరి వంగడాలను పరిశీలించి పంటల అత్యధిక దిగుబడికి కావాల్సిన సూచనలను రైతులకు ఇచ్చారు. ఆయన వెంట జేడీ రాధిక, సీఎస్‌సీఓ విశ్వనాథ్ పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో మేట్ల పాత్ర కీలకం



మేట్లకు శిక్షణ ఇస్తున్న సీఎల్ఆర్‌సీ సీడీ ఏసుదాసు

జూపాడుబంగ్లా: ఉపాధిహామీ పనుల్లో మేట్ల పాత్ర కీలకమని సీఎల్ఆర్‌సీ సీడీ ఏసుదాసు తెలిపారు. సోమవారం స్థానిక ఉపాధిహామీ పథకం కార్యాలయంలో మేట్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల గుర్తింపు, కేటాయింపు, చేయించటం, కూలీలకు ఆన్‌లైన్‌లో హాజరు వేయడం తదిరత కీలక బాధ్యతలను మేట్లు నిర్వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఈసీ నజీర్, టీఏ చిన్న పాల్గొన్నారు.

• పగిద్యాల: స్థానిక ఉపాధి హామీ పథకం కార్యాలయంలో సోమవారం ఉపాధి మేట్‌లకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమం చేపట్టారు. కో ఆర్డినేటర్ ఏసుదాసు, ఎంపీడీఓ సుమిత్రమ్మ హాజరై మేట్‌లకు పలు సూచనలు చేశారు. కొలతల ప్రకారం పనులు చేయిస్తే రూ.300ల వరకు వేతనం వస్తుందని, పని ప్రదేశంలోనే కూలీల మస్టర్ అటెండెన్స్‌ను నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ మద్దిలేటి, ఈసీ అశోక్, టెక్నికల్, ఫీల్డ్‌అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

క్లస్టర్లుగా గ్రామ సచివాలయాలు

పాములపాడు: గ్రామ సచివాలయాలను క్లస్టర్లుగా ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపినట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 14 గ్రామ పంచాయతీలకు గాను 13 గ్రామ సచివాలయాలు ఉన్నాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రెండు గ్రామ సచివాలయాలను ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. పాములపాడు1, పాములపాడు 2(రుద్రవరం), మిట్టకందాల గ్రామ పంచాయతీలు ఒక క్లస్టర్‌గా, వానాల, మద్దూరు ఒక క్లస్టర్‌గా, వేంపెంట, బానకచెర్ల ఒక క్లస్టర్‌గా, బానుముక్కల , యర్రగూడూరు ఒక క్లస్టర్‌గా, ఇస్కాల, చెలిమిల్ల ఒక క్లస్టర్‌గా, జూటూరు1, జూటూరు 2(తుమ్మలూరు) ఒక క్లస్టర్ గా ఏర్పాటు కానున్నాయని తెలిపారు. ఆయా గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న సిబ్బందిని క్లస్టర్లకు నియమిస్తూ మిగిలిన వారిని ఇతర కార్యాలయాలకు నియమించే అవకాశాలు ఉన్నట్లు పలువురు సిబ్బంది చర్చించుకుంటున్నారు.

20న వేలం పాటలు

ఆత్మకూరు: ఈనెల 20న స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వారపు సంత మార్కెట్, దినసరి కూరగాయల మార్కెట్, బస్టాండు ఫీజు, చిన్న కమేళా, పెద్ద కమేళా, చేపలు, చికెన్ విక్రయాల హక్కులకు వేలం పాటలు నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు సోమవారం తెలిపారు. వేలం పాట దక్కించుకున్న వారికి ఏప్రిల్ 1 నుంచి వచ్చే ఏడాది మార్చి 31 వరకు విక్రయాల హక్కులు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు మున్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

రీ సర్వేకు 6 అర్జీలు

పాములపాడు: రీ సర్వే చేయాలంటూ రైతుల నుంచి 6 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ సుభద్రమ్మ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భూ సమస్యలపై రైతులు అర్జీలు ఇచ్చారు. కాగా ప్రతి అర్జీని పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఆమె రైతులకు వివరించారు. కార్యక్రమంలో డీటీ పఠాన్‌బాబు, రీ సర్వే డీటీ సుప్రియ, ఆర్ఐ ఖజాబీ, వీఆర్వోలు పాల్గొన్నారు.



పాఠశాల వద్ద ఎండలో వేచివున్న విద్యార్థులు

ఎండవేడిమికి విద్యార్థులు విలవిల

జూపాడుబంగ్లా: జూపాడుబంగ్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు అరగంటపాటు ఎండలో నిల్చొని తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సోమవారం నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కావటంతో ఉన్నత, మోడల్ స్కూళ్లలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేశారు. పరీక్షా కేంద్రాలున్న పాఠశాలల్లో మధ్యాహ్నం ఒంట గంట నుంచి సాయంత్రం 5 గంటల దాకా పాఠశాలలు నిర్వహించాలని అధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఈనేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం 12.30 గంటలకు ఉన్నత పాఠశాలకు విద్యార్థులు హాజరయ్యారు. పదో తరగతి విద్యార్థులు పరీక్షాకేంద్రం నుంచి బయటకు వచ్చేంత వరకు విద్యార్థులు రోడ్డుపైన వరుసక్రమంలో ఎండల్లో నిల్చొని తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. విద్యార్థుల అవస్థలు చూసి తల్లిదండ్రులు మనోవేదనకు లోనయ్యారు. పాఠశాలల వద్ద విద్యార్థుల సౌకర్యార్థం సేమియానా ఏర్పాటుచేసి నీడను కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

కొనసాగుతున్న ప్రజాచైతన్య యాత్రలు

సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజాచైతన్య యాత్రలు కొనసాగుతున్నాయి. అందులో భాగంగా ఆ పార్టీ నాయకులు బృందాలుగా ఏర్పడి సోమవారం గ్రామాల్లో పర్యటిస్తూ సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు.



ఆత్మకూరు గరీబ్‌నగర్‌లో కాలనీవాసులతో మాట్లాడుతున్న సీపీఎం నాయకులు



నందికొట్కూరులో కబ్జాకు గురైన దళితుల ఇంటి స్థలాలు పరిశీలిస్తున్న నాయకులు

ఆత్మకూరు: సీపీఎం సీనియర్ నాయకులు ఎ.రాజశేఖర్, పట్టణ కార్యదర్శి ఎ.రణధీర్, శాఖ కార్యదర్శి ఎ.సురేంద్రలు సోమవారం పట్టణంలోని గరీబ్‌నగర్‌లో పర్యటించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఏళ్ల క్రితం ఏసిన సిమెంట్ రోడ్డు కావడంతో గుంతలు పడి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని, చేతిపంపు రిపేరీ చేయించాలని, స్థానికులు నాయకుల దృష్టికి తెచ్చారు.

• బండిఆత్మకూరు: మండల పరిధిలోని ఏ.కోడూరు గ్రామంలో సీపీఎం మండల నాయకుడు డేవిడ్ ఆధ్వర్యంలో ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. ముస్లిం కాలనీలో మినీ వాటర్ ట్యాంక్‌ను నిర్మించాలని కోరారు.

• పాములపాడు/కొత్తపల్లి: సీపీఎం నాయకుడు స్వాములు పాములపాడు ఎస్సీ కాలనీ, కొత్తపల్లి మండలం చిన్న గుమ్మడాపురం గ్రామంలో పర్యటించి ప్రజా సమస్యలను తెలుసుకున్నారు.

• జూపాడుబంగ్లా: పారుమంచాల గ్రామంలోని రైతుకు చెందిన మిర్చి దిగుబడులను సీపీఎం మండల కన్వీనర్ కర్ణ పరిశీలించారు. పెట్టుబడి సాయం అందించకుండా కూటమి ప్రభుత్వం రైతులను మోసం చేసిందని కర్ణ విమర్శించారు.

• నందికొట్కూరు: దళితుల ఇంటి స్థలాలను కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ (యూ) జిల్లా కన్వీనర్ లాజరస్ డిమాండ్ చేశారు. సోమవారం మారుతీ నగర్‌లో కబ్జాకు గురైన దళితుల ఇంటి స్థలాలను ఆయన పరిశీలించారు.



కొత్తపల్లి పరీక్షా కేంద్రం నుంచి పరీక్ష ముగించుకొని వస్తున్న విద్యార్థులు.



నందికొట్కూరు గవర్నమెంట్ హైస్కూల్‌లో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

'పది' పరీక్షలు ప్రారంభం

శ్రీశైలం, నందికొట్కూరు నియోజకవర్గాల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు కావడంతో విద్యార్థులు పరీక్షా కేంద్రాల వద్దకు గంట ముందుగానే చేరుకున్నారు. తమ పిల్లలను పరీక్ష రాయించేందుకు విద్యార్థుల తల్లిదండ్రుల రాకతో ఆయా పరిసరాలు సందడిగా మారాయి. 144 సెక్షన్ అమలులో ఉండటంతో పరీక్ష ప్రారంభం కాగానే విద్యార్థుల తల్లిదండ్రులను అక్కడి నుంచి పోలీసులు దూరంగా పంపించేశారు. పరీక్షా కేంద్రాలను పోలీసు, విద్యాశాఖ అధికారులు సందర్శించి ఎలాంటి ఘటనలు చేసుకోకుండా పర్యవేక్షించారు. కాగా నందికొట్కూరు మండలంలో 16 మంది, కొత్తపల్లిలో 10 మంది, జూపాడుబంగ్లాలో 3, పగిద్యాలలో 12, బండి ఆత్మకూరులో 15, మహానందిలో 16 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని ఆయా మండలాల పరీక్షల నిర్వహణాధికారులు తెలిపారు. – సాక్షి నెట్‌వర్క్



జూపాడుబంగ్లా: విద్యార్థులను చెక్‌చేసి పరీక్షాకేంద్రంలోకి పంపిస్తున్న ఇన్విజిలేటర్లు



పాములపాడులో విద్యార్థులను గేటు వద్ద తనిఖీ చేస్తున్న పోలీసులు



ఆత్మకూరులో పరీక్షా కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ద్వారా తాగు నీరు అందిస్తున్నాం



సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ బేబి

నందికొట్కూరు: పట్టణ ప్రజలకు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు ద్వారా రక్షిత మంచి నీరు అందిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ బేబి తెలిపారు. సోమవారం సమ్మర్ స్టోరేజ్ ట్యాంకును మున్సిపల్ కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈమె వెంట మున్సిపల్ డీఈనాసీర్, ఏఈ దినేష్‌కుమార్ ఉన్నారు.

పీహెచ్‌సీకి పరికరాలు మంజూరు



మంజూరైన పరికరాలను చూపుతున్న డాక్టర్ గంగాధర్, సూపర్‌వైజర్ రాముడు

జూపాడుబంగ్లా: ఈనెల 15న 'సాక్షి' దినపత్రిలో 'హామీ ఇచ్చి మరిచిన జిల్లా వైద్యాధికారి' శీర్షికన ప్రచురితమైన కథనానికి జిల్లా వైద్యాధికారి స్పందించారు. జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సుఖప్రసవాలు చేసేందుకు అవసరమైన పరికరాలు వెంటనే మంజూరు చేశారు. మంజూరైన పరికరాలను ఆసుపత్రిలోని డెలివరీ గదిలో అమర్చినట్లు డాక్టర్ గంగాధర్ తెలిపారు. ఇక నుంచి నుంచి ఆసుపత్రిలోనే సుఖప్రసవాలు చేయనున్నట్లు తెలిపారు. మండల పరిధిలోని గర్భిణులు ప్రసవం కోసం జూపాడుబంగ్లా ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికినే రావాలన్నారు.